జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

సోమవారం | 21 | అక్టోబర్ | 2024 ◆ పేజీలు : 7





(మృతుడి ఫైల్ ఫోటో)

## అన్న మరణానికి తమ్ముడే...

# కాలయముడయ్యాడు

**- 'భూ' ఆస్తి తగాదాలతో అన్నను చంపిన తమ్ముడు**

*మల్లాపూర్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

తమ్ముడే కాలయముడై అన్నను హతమార్చిన ఘటన మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఓబులాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలు (34) అనే వ్యక్తిని సొంత తమ్ముడు చందు హత మార్చాడు. కొద్దిరోజుల నుండి 'భూ' ఆస్తి తగాదాలతో గొడవ పడుతున్న అన్నదమ్ముల గొడవ చివరకు హత్య చేసే వరకు దిగజారింది. ఒకే తల్లికి పుట్టిన అన్నదమ్ములు చంపుకునేంత కక్షలు పెంచుకొని అన్నను కత్తితో తల మొండెం వేరుచేసి హతమార్చిన సంఘటన స్థానికులను కలిచివేసింది. మృతుడికి భార్య నవ్య ఇద్దరు కుమార్తెలు మొదటి కుమార్తె ధరణి 12, రెండవ కుమార్తె వైష్ణవి (07) ఉన్నారు. ఒకే తల్లికడుపున ఏడుగురు అన్నదమ్ములు ఇద్దరు ఆడపడుచులు ఉన్నఓ పెద్దకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భూ తగాదాలతో, తోడ బుట్టిన అన్ననే అతి కిరాతకంగా నరికి చంపాడు ఓ తమ్ముడు. తన అన్న గోదావరి ఒడ్డున ఉన్నాడన్న సమాచారం తెలియడంతో, తల్వార్ తీసుకెళ్లి మెడపైన తోడ బుట్టిన తమ్ముడు నరికి, ఘోరాది ఘోరంగా హత్య చేశాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో చోటుచేసుకుంది. మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లెపు చందు, పల్లెపు సాయిలు ఇద్దరన్నదమ్ముల మధ్య, గత కొద్దేళ్లుగా భూ తగాదా నడుస్తుంది. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాల క్రితం, వీరు గొడవపడి కొట్టుకోవడంతో వీరిద్దరిపైన మల్లాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న చందు, ఎట్లైనా సరే తన అన్నను హతమార్చాలనుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఒబులాపూర్ సమీపంలో గల గోదావరి ఒడ్డున అన్న సాయిలున్నాడన్న విషయం తెలియగానే, అక్కడికి వెళ్లి సొంత అన్న అని చూడకుండా తన వెంట తెచ్చుకున్న తల్వార్తో మెడపైన నరికి చంపాడు. దీంతో మొండెం శరీరం వేరుపడ్డాయి. సమాచారం తెలిసిన వెంటనే మెట్పల్లి డిఎస్పీ ఉమామహేశ్వర రావు, సిఐ నిరంజన్ రెడ్డి, మల్లాపూర్ ఎస్సై పబ్బా కిరణ్ కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. శవ పంచనామా జరిపించి, నేరస్థుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతి కిరాతకంగా హత్య చేసిన నేరస్తుడిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



## నిజమైన కార్యకర్తలకు

# అతి త్వరలో గుర్తింపు

**– త్వరలో నియోజకవర్గంలో 4వేల ఇందిరమ్మ ఇండ్లు**

**– కష్టకాలంలో కాంగ్రెస్ జెండా మోసినవారికే ఇందిరమ్మ కమిటీలో చోటు**

**– రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవరాహరల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**



*రామగిరి, అక్టోబర్ 20 (ప్రజాజ్యోతి ):*

కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను త్వరలో గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లో చోటు కల్పించే కార్యక్రమానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవరాహరల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టానున్నారనీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 సంవత్సరాల పాటు గడ్డుకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన సాధారణ కార్యకర్తలకు తగిన గుర్తింపునిచ్చే కార్యక్రమం మంథని నియోజకవర్గం లో త్వరలో అమలుకానున్నట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. హైదరాబాదులోని మినిస్టర్ క్వాటర్స్ లో మంథని నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్, మండల అధ్యక్షులతో మంత్రి శ్రీధర్ బాబు ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో

మిగతా 2 లో...

## రైతు భరోసాను ఎగగొట్టటం..

# రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమే

**- వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లే అని తుమ్మల చేసిన ప్రకటనపై కోరుట్ల బిఆర్ఎస్ మైనార్టీ యూత్ అధ్యక్షుడు ఎండీ. అతీక్ ఆగ్రహం**

**- వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాల్సిందేనని ఎండీ. అతీక్ డిమాండ్**



4 లో...



## ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన ఎండి ఖలీల్ ఖాన్

**రామగిరి, అక్టోబర్ 20 (ప్రజాజ్యోతి):**



కమాన్ పూర్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఎండి ఖలీల్ ఖాన్ ఏఎస్ఐ గా పదోన్నతి పొందారు. 1989లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా విధుల్లో చేరిన ఆయన కరీంనగర్ వన్ టౌన్, మంథని ముత్తారం, జగిత్యాల, బసంత్ నగర్, కొయ్యూరులలో కానిస్టేబుల్ గా పని చేశారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి పొంది మంథని, గోదావరిఖనిలో పనిచేశారు. ప్రస్తుతం ఏఎస్ఐ గా పదోన్నతి పొంది కమాన్పూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఫ్రెండ్స్ యూత్

**ముస్తాబాద్ అక్టోబర్ 20(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని సుభాష్ నగర్ లో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన మెంగని సత్యనారాయణ కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు.అనంతరం మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని,ఇంకెవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు కోరారు.నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్లు ఎవరైనా ఉంటే ఫ్రెండ్స్ యూత్ సభ్యులకు తెలియజేస్తే వారి కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.మృతుని కుటుంబ సభ్యులు ఫ్రెండ్స్ యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ కార్మికులను అక్కున చేర్చుకున్నందుకేనా..

**– సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇచ్చినందుకు అక్కసు వెళ్ళగాక్కుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**

**– బీఆర్ఎస్ అధికారం ఉన్నన్నాళ్ళు కనీస వేతనాలకు నోచుకోని కాంట్రాక్ట్ కార్మికులు**

**– మొదటిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే**

**– మంథని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్**



**రామగిరి, అక్టోబర్ 20 (ప్రజాజ్యోతి)**

సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సింగరేణి లాభాల వాటాలో భాగస్వామ్యం కల్పించి బోనస్ ఇచ్చి, అక్కున చేర్చుకున్నందుకే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు కర్ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని మంథని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ అన్నారు. దేశ చరిత్రలో మొట్టమొదటి సారి రాష్ట్ర ప్రభుత్వ భాగ్యస్వామ్యంతో నడుస్తున్న సింగరేణి సంస్థ నుండి లాభాల వాటలో కాంట్రాక్టు కార్మికులకు సైతం లబ్ధి చేకూర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనన్నారు. గత పదేండ్లు అధికారంలో ఉండి కార్మికుల సమస్యలు పట్టని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడిన తీరు, ముసలి కన్నీరుపెట్టిన చందంగా ఉందని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల బోనస్ విషయంపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం బర్ల శ్రీనివాస్ విలేకరి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి కార్మికులతో సమానంగా లాభాల వాటలో బోనస్ ఇప్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకే చెందుతుందనీ, ఓబి కాంట్రాక్ట్ లో పనిచేసే కార్మికులకు రాబోయే కాలంలో ప్రతి విషయంలో న్యాయం చేసే బాధ్యత సింగరేణి ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నాయకులు తీసుకుంటారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇదే సుషి, హెచ్డి, ఎన్సిసి కంపెనీలను అనుచరులతో బెదిరించి వసూలు చేసిచ్చిన ముడుపుల సంగతి గుర్తు తెచ్చుకోమని, రచ్చపల్లి, రామగిరి లోనీ అనుచరులతో ఓబి ప్రవేట్ కంపెనీల యాజమాన్యాలను బెదిరించి డబ్బులు వసూలు చేసుకుంటూ ఉద్యోగాలు పెట్టించిన చరిత్ర మీది కాదా! అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోయిన భూ నిర్వాసితులకు అండగా నిలుస్తూ నిజాయితీగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత దుద్దిళ్ళ కుటుంబానికి చెందుతుందన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు గుర్తుకురాని కార్మికులు ఇప్పుడు గుర్తుకు రావడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, పోరాడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కార్మికులే ఉండరని కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేస్తామని చెప్పిన మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కార్మికులకు ఏం చేశారని అలాగే నిండు అసెంబ్లీ సమావేశాల్లో కేటీఆర్ కార్మికుల గురించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 25 వెలకు వేతనాలకు తక్కువగా ఏ కార్మికుడు లేడని మోసపూరిత వ్యాఖ్యలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం సింగరేణిలో రాష్ట్ర వాటా 51 శాతం ఉన్నప్పటికీ కూడా 10 ఏళ్ల అధికారంలో ఉండి కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు లేదా కోల్ ఇండియా వేతనాలు ఎందుకు ఇవ్వలేకపోయారో చెప్పాలన్నారు. సింగరేణి లాభాల వాటా లో ఏ ఒక్క రోజు రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని, పక్కనే ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ లో కోల్ ఇండియా వేతనాలు అమలు చేస్తే పదేండ్లు అధికారంలో ఉండి ఎందుకు ఇవ్వలేకపోయారనీ ప్రశ్నించారు. .అధికారం ఉందని ఓబి కంపెనీ యాజమాన్యాలను పోలీసు వ్యవస్థని చేతిలో పెట్టుకొని, కార్మికులు వేతనాల కోసం సమ్మె బాట పడితే అధికార బలంతో కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను, అప్పటి రామగుండం సిపి సత్యనారాయణ కార్యాలయంలో భయ భ్రాంతులకు గురిచేసి రాత్రికి రాత్రే సమ్మెను నీరుగార్చింది పుట్ట మధు, కోరుకంటి చందర్ లా అనుచరులు కాదో చెప్పాలన్నారు. సుశీ కంపెనీ పనిచేసిన కాలంలో మీ అనుచరుల చెప్పుచేతల్లో కనుసన్నల్లో పని చేసింది నిజం కాదో అవునో మీ కార్యకర్తలని అడగాలన్నారు. ఓబీ కంపెనీ యాజమాన్యాలకు తొత్తులుగా మారి వారికి సహకరిస్తూ కార్మికుల పొట్టలు కొట్టారని, గతంలో ఓబీ కంపెనీలో ఉద్యోగం పొందాలంటే అనుభవ ప్రావీణ్యతను బట్టి కంపెనీ యాజమాన్యం ఉద్యోగ అవకాశాలు కల్పించే వ్యవస్థను టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఓబి కంపెనీల్లో రాజకీయ జోక్యం చేసుకొని రాజకీయ వ్యవస్థను రాజకీయ నాయకులను ఏజెంట్లుగా పెట్టుకొని ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట చంద్రయ్య, మాజీ ఎంపీపీలు ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, నీరజ తులసిరామ్ గౌడ్, మాజీ ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, సెంటినరి కాలనీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం నాయకులు గాజుల శ్రీనివాస్, ఉడుత శంకర్, రామ్ నారాయణ, బొజ్జ సతీష్, శ్రీనివాస్, అవినాష్, కామెర నరేష్ అధిక సంఖ్యలో యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

**కొడిమ్యాల, అక్టోబర్ 20, (ప్రజాజ్యోతి):**

ద్విచక్రవాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దొంగలమర్రి నుండి జేఎన్టీయూకు వెళ్ళే రహదారిపై ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయని,గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ లో జగిత్యాల ఏరియా హాస్పిటల్ కి తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రులు మల్యాల మండలానికి చెందిన వారిగా గుర్తించారు.







## నిజమైన కార్యకర్తలకు అతి త్వరలో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి...)



ఈ విషయంపై దిశా నిర్దేశం చేసినట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చందుకు ప్రభుత్వం హామీ ఇవ్వగా, ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీలో గ్రామ ప్రత్యేక అధికారి, కార్యదర్శి, ఇద్దరు మహిళా సంఘాల సభ్యులతో పాటు మరో ముగ్గురికి ఆ కమిటీలో చోటు కల్పించానున్నారు. దీంతో గ్రామస్థాయి నుండి లబ్ధిదారులను ఎంపిక చేసే పక్రియలో ఇందిరామ్మా కమిటలా పాత్ర అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏర్పాటు చేయబోయే ఇందిరమ్మ కమిటీలో పార్టీ పదవుల్లో ఉన్నవారికి, మాజీ ప్రజా ప్రతినిధులను కాకుండా సాధారణ కార్యకర్తలను మాత్రమే కమిటీల్లో చోటు కల్పించే బాధ్యతను మండల అధ్యక్షులకు అప్పచెప్పినట్లు, ఇందిరమ్మ కమిటీల్లో చోటు పొందిన వారు రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకూడదనే షరతును విధించినట్లు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు తీసుకున్న ఈ నిర్ణయం శ్రీధర్ బాబు గెలుపు కొరకు కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన సాధారణ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత కాటారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కష్టపడ్డ వారికే ప్రాధాన్యత అని చెప్పిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాటలు ఇంత త్వరగా అమలు జరుగుతుండడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో "జై శ్రీధర్ బాబు" అనే నినాదం మార్మోగుతుంది. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మహదేవ్ పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపు, కమాన్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైనాల రాజు, మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్ల బాలాజీ, కాటరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, పలిమెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండబోయిన చిన్నాన్న, మహా ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పక్కల సదువలి, మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్, మలహర్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితల రాజయ్య పాల్గొన్నారు.

## హెల్త్ కార్డుల మంజూరీకి కృషిచేస్తా

**ప్రైవేటు ఉపాధ్యాయులకు 2 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తా...**




**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి,**

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీభారీ మెజారిటీ తో గెలిపించాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి కోరారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో సుమంగళి గార్డెన్ లో ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న లెక్చలర్లు ప్రధానోపాధ్యాయులు పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి హెల్త్ కార్డుల మంజూరు కోసం ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూల్, గురుకులాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 జీవో ప్రకారం కనీస వేతనాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు.ప్రైవేట్ టీచర్లకు 2 లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తానని అన్నారు.

# హుజురాబాద్ లో ఐఏఎస్ ల ప్రత్యేక పూజలు





*హుజురాబాద్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

భక్తుల కొంగుబంగారంగా భావించే హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోని నవగ్రహ సహిత శ్రీ నాగేంద్ర స్వామి దేవాలయంలో కరీంనగర్, అమరావతికి చెందిన ఐఏఎస్ మిత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి నాగేంద్ర స్వామి దేవాలయం మహిమల (విశిష్టత) గురించి తెలుసుకున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఆలయాన్ని సందర్శించగా.. ఆలయ ప్రధాన పూజారి పందిళ్ళ భాస్కర్ శర్మ వారికి ప్రత్యేక పూర్ణకుంభ స్వాగతం పలికి... నవగ్రహ పూజలు, దోష నివారణపూజలు, పుట్టపూజ, నవరసాభిషేకము, కుంకుమ పూజలు తదితర ప్రత్యేక పూజలు వారిచే చేయించారు. ఆలయ ప్రత్యేకతను తెలుసుకొని తామే వచ్చినట్లు ఈ సందర్భంగా ఐఏఎస్ లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆలయ సమీపంలో కళ్యాణ మండపం కావాలని వారిని కోరగా.. సంబంధిత మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఎస్టిమేషన్ వేసి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. సుమారు గంట పాటు ఐఏఎస్లు ఆలయం వద్ద గడిపి ప్రత్యేకపూజలు చేయడంతో పలువురు ఆసక్తిగా వారిని తిలకించారు. వారి వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# రైతు భరోసా కోసం రోడ్డు ఎక్కిన బీఆర్ఎస్ నాయకులు





**కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసన సెగ**

**పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి**

**ధర్నా రాస్తారోకో చేసిన బీఆర్ఎస్ నాయకులు**

*జమ్మికుంట, అక్టోబర్20, ప్రజాజ్యోతి*

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద 15వేల రూపాయలు ఈ ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా పోయినట్లే అని వ్యవసాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కే టి ఆర్ పిలుపు మేరకు జమ్మికుంట ప్రాథమిక సహకార సొసైటీ చైర్మన్ పోనగంటి సంపత్ అధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీనాయకులు ధర్నా చేపట్టారు... ఈ సందర్భంగా వారుమాట్లాడుతూవానాకాలంరైతు భరోసా ను ఎగగొట్టటం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమే అని అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం అని గత అసెంబ్లీ ఎన్నికలో కేసీఆర్ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసింది అని తెలిపారు.వానాకాలం పంట సీజన్ కు రైతుబంధును పూర్తిగా ఈ ప్రభుత్వం ఎగ్గొట్టేసింది అని అన్నారు.లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టింది.రేపు, మాపు అంటూ నెట్టుకొస్తున్నప్పుడే ఈ ప్రభుత్వం మీద అనుమానం కలిగింది అని అన్నారు. ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారు. మీ చేతగానీతనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదు అని అన్నారు. వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి 15వేల రైతు భరోసా ఇచ్చేవరకు బిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, లింగారావు, అర్బన్ అధ్యక్షుడు రాజ్ కుమార్, పార్టీ నాయకులు లింగరావు,దిలీప్,పాతకాల రమేష్,మంద రాజేష్ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కోసం బీఆర్ఎస్ నాయకులు ధర్నా



*జగిత్యాల, అక్టోబర్ 20, ప్రజా జ్యోతి*

వానకాలం ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఇవ్వాల్సిన రైతుభరోసా ఇవ్వమని ఎగవేసిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం రాయికల్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు..ఎకరానికి 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరుని ఎండగట్టాలని .పచ్చి అబద్ధాలు, మోసాలతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ మోసం చాలదన్నట్లు ...ఇప్పుడు రైతు భరోసాలోనూ దగా చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే ఎక్కడికక్కడ మీ ప్రజాప్రతినిధులను ప్రజలే నిలదీస్తారని హెచ్చరించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని.. రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ వదిలేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మండల మరియు పట్టణ BRS నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా సీఎం సహాయ నిధి ఎమ్మెల్యే విజయ రమణారావు

*సుల్తానాబాద్ అక్టోబర్ 20(ప్రజా జ్యోతి)*

ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన బాలసాని స్నిగ్ధ కొన్ని రోజులుగా అనారోగ్య కారణంగా హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా తన ఆరోగ్య కర్చుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆదివారం రెండు లక్షల రూపాయలను ఎల్వోసిని మంజూరు చేయించి చెక్కును అందజేసిన పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే విజయ రమణారావును కలిసిన నూతన ఏజీపి దూడం ఆంజనేయులు



*సుల్తానాబాద్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు నూతనంగా అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియామకమైన సీనియర్ న్యాయవాది దూడం ఆంజనేయులు ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే విజయ రమణారావు కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ బిరుదు సమతాకృష్ణ, మాజీ జడ్పీటిసి మినుపాల స్వరూప ప్రకాశరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు వెగోళం అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షులు చిలుక సతీష్, కాంగ్రెస్ నాయకులు కుమార్ కిషోర్, అమిరిశెట్టి తిరుపతిలకు ఏజిపి ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

## సంఘం అభివృద్ధికి కృషి చేస్తా



*సుల్తానాబాద్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

పద్మశాలి కుల సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పద్మశాలి సేవ సంఘం పెద్దపల్లి జిల్లా అడక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీనగర్ లో దసరామేళ, పద్మశాలి ఆత్మీయుల సమ్మేళనం కార్యక్రమంలో వలస నీలయ్య ను దసరా మేళా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలిల అభ్యున్నతి కోసం కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కామర్తకు మురళి, ప్రధాన కార్యదర్శి రామచంద్రావు, పెద్దపెల్లి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండేటి రాజేష్, గ్యాజంగి లక్ష్మణ్, ల తోపాటు అధిక సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## దైవ దర్శనానికి వెళ్లి కృష్ణా నదిలో మృతి

*జమ్మికుంట, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*



ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సమీపంలో దైవదర్శనానికి వెళ్లి కృష్ణా నదిలో పడి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం. సీతంపేట గ్రామానికి చెందిన పోతన రాజేంద్రమ్ సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్ (38) ఈనెల 17న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో కృష్ణానది సమీపంలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడానికి వెళ్లాడు..కృష్ణా నదిలో స్నానం చేసేందుకు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. రెండు రోజులుగా నది పక్కనే బ్యాగు ఉండటాన్ని చూసిన స్థానికులు సమీపంలోని యాపలదిండి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు విషయాన్ని మృతుడు వేణుగోపాల్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దాంతో వారు అక్కడికి వెళ్లి పోలీసుల సహకారంతో విచారణ చేపట్టగా సంఘటన స్థలం నుంచి 40 కిలోమీటర దూరంలో మృతదేహం లభించింది. దీంతో సీతంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి..

## ఉమ్మడి జిల్లా ఖో ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**– సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**– ఉమ్మడి జిల్లా ఖో ఖో జట్ల ఎంపికకు విశేష స్పందన**

**– హాజరైన 375 మంది బాలబాలికలు**



*కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి*

కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఖో ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి కి ఎదగాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి సుడా చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందులోని భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ని హైదరాబాదులో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ఖో ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 375 మంది బాల బాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్నగర్లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అనంతరం బాలబాలికలకు వేరువేరుగా ఖో ఖో పోటీలను నిర్వహించి ప్రతిపచాటున క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖో ఖో సంఘ సభ్యులు వంగపల్లి సూర్యప్రకాష్, సిఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, కట్ట సంతోష్ ఎస్.కె మొయినుద్దీన్, శివకుమార్, గెల్లు మధుకర్, సంధ్యా, కరుణాకర్, నవీన్ కుమార్ , పాల్గొన్నారు.

## బి.సి మహిళా సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రోజా నియామకం

*జగిత్యాల, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*



హైదరాబాదులో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శ్రీ ఆర్. కృష్ణయ్య ఎం.పి ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి సమావేశంలో కోరుట్ల పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ కులస్తురాలైన రాచకొండ రోజా (న్యాయవాదిని )వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములైనందుకు, బి.సి లను చైతన్యపరిచినందుకు, మరియు వివిధ బి.సి ఉద్యమాల్లో పాల్గొన్నందుకు గాను బి.సి మహిళా సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రోజా (న్యాయవాది) నియమించనైనది. బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.పి ఆర్. కృష్ణయ్య గారి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ గారి సూచన మేరకు బి.సి మహిళా సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రోజా (న్యాయవాది )గ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ వీరిని నియమించనైనది. వీరి నియామకం తేది: 20–10–2024 నుండి అమల్లోకి వచ్చునని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, జగిత్యాల జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి వారిని కలిసి అభినందించారు.


# ప్రభుత్వ హాస్పిటల్ లో హాజరు..

# ప్రైవేట్ హాస్పిటల్ లో దందా..

**పేద ప్రజలకు అందని సర్కారు వైద్యం**

**హుజురాబాద్ ఏరియా హాస్పిటల్ డాక్టర్ చేగొండ శ్రీనివాస్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.**






*హుజురాబాద్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

హుజురాబాద్ ప్రాంతీయ హాస్పిటల్ డ్యూటీ డాక్టర్ చేగొండ శ్రీనివాస్ తన డ్యూటీ టైములో వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో హాజరు వేసుకున్న తర్వాత డబ్బు సంపాదన ధ్యేయంగా పేద రోగుల బాగోగులు పట్టించుకోకుండా డ్యూటీ ని వదిలిపెట్టి వారి సొంత హాస్పటల్ జమ్మికుంటలోని వరుణ్ సాయి ఆర్థోపెడిక్ హాస్పిటల్ లో ఓపి చూస్తున్నారని మండిపడ్డారు. వివరాల్లోకి వెళితే తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటి సభ్యులు చెల్పూరి రాములు విలేకరులతో మాట్లాడుతూ, శనివారం రోజున హుజురాబాద్ ప్రాంతీయ ఏరియా హాస్పిటల్ కి తన ఆరోగ్య రీత్యా సుమారు ఒకటిన్నర గంటలకు వెళ్లానన్నారు. అక్కడ ఉన్న సిబ్బందిని డాక్టర్ ఎక్కడ ఉన్నారు అని అడగగా.. ఏమో అండి మాకు తెలియదు డాక్టర్ వస్తారు మీరు వెయిట్ చేయండని చెప్పడం జరిగిందన్నారు. జమ్మికుంటలో ఓపి చూస్తున్నారని తెలియగానే డీసీహెచ్ఓకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా... సాయంత్రం 6 గంటలకు వచ్చిన డాక్టర్...వచ్చిన పేషంట్లతో దురుసుగా వ్యంగ్యంగా దుర్భాషలాడుతూ నువ్వు డిసిహెచ్ఓకి ఫోన్ చేసి నా పైన ఫిర్యాదు చేస్తావా ఇక్కడి నుండి బయటికి వెళ్లిపో అని అరుస్తూ..నువ్వు ఎవరికీ చెప్పుకుంటావో చెప్పుకోపో, ఎం చేసుకుంటావో చేసుకోపో అని వెళ్ళిపోయారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ పై డ్యూటీ డాక్టర్ చెగొండ శ్రీనివాస్ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవలన్నారు. ఇట్టి విషయం పై తెలంగాణ సీఎంఓ, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. హుజురాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి ముందు నిరసన తెలుపడం జరిగిందన్నారు.






# వానాకాలం రైతు భరోసాను ఎగగొట్టటం..

# రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమే

**- వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లే అని తుమ్మల చేసిన ప్రకటనపై కోరుట్ల బిఆర్ఎస్ మైనార్టీ యూత్ అధ్యక్షుడు ఎండీ. అతీక్ ఆగ్రహం**

**- వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాల్సిందేనని ఎండీ. అతీక్ డిమాండ్**

*కోరుట్ల , అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*



కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం చెబుతున్నారన్న కేసీఆర్ మాటలను రేవంత్ రెడ్డి సర్కార్ అక్షరాల నిజం చేసింది అని ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎండీ. అతీక్ మాట్లాడుతూ వానాకాలం పంట సీజన్ కు రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టేసింది. లక్షలాది మంది రైతుల నోట్లో మట్టి కొట్టింది. రేపు, మాపు అంటూ నెట్టుకొస్తున్నప్పుడే ఈ ప్రభుత్వం మీద అనుమానం కలిగింది. ఇప్పుడు స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతులేస్తున్నట్లు ప్రకటించారు. మీ చేతగానీ తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేలేదు. సబ్ కమిటీ, గైడ్ లైన్స్ అంటూ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొడతామంటే విడిచి పెట్టే పరిస్థితి లేదు. ఎద్దు ఏడ్చినా ఏవుసం, రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడదంటారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ కు ఉసురు తప్పదు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవటంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు మొదలు పెట్టారు.. కేసీఆర్ పదివేలు ముష్టి వేస్తున్నాడు...మేము రూ. 15 వేలు ఇస్తామన్న సిపాయి ఎక్కడ?పేదల కడుపు కొట్టి రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులుంటాయా? మీరు చెప్పినట్లు రైతులకు ఎకరానికి రూ. 7500 ఇచ్చేందుకు పైసలు లేవా? పచ్చి అబద్ధాలు, మోసాలతో రైతులను దగా చేశావ్. కాంగ్రెస్ మాటలు నమ్మి గెలిపించిన రైతులను అరిగోస పెడుతున్నావ్. రైతులతో చెలగాటమాడితే విడిచి పెట్టే ప్రసక్తి లేదన్నారు. రుణ మాఫీ మోసంచాలదన్నట్లు.. ఇప్పుడు రైతు భరోసాలోనూ దగానే. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందే. లేదంటే ఎక్కడికక్కడ మీ ప్రజాప్రతినిధులను ముట్టడిస్తాం. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ ను వదిలే ప్రసక్తే లేదన్నారు.

# క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత

### ఉత్తర తెలంగాణ కేంద్రంగా భవిష్యత్తులో అతి పెద్ద స్టేడియం నిర్మాణానికి కృషి

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేందర్ రెడ్డి

### పిఈటి ల నుండి పిడి లుగా పదోన్నతులు పొందిన వ్యాయమ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**




తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగానికి .అధిక ప్రాధాన్యత ఇస్తానని కరీంనగర్ అదిలాబాద్ నిజాంబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డా. వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రం లో ని ఓ సమావేశ మందిరం లో వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పీఈటీల నుండి పీడీలుగా పదోన్నతులు పొందిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాను న్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ఉత్తర తెలంగాణ కేంద్రంగా అతిపెద్ద స్టేడియం నిర్మాణానికి కృషిచేస్తానని వ్యాయామ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ప్రహరీ గోడలు లేక అన్యక్రాంత మవుతున్నాయని వాటన్నిటికీ ప్రహరీ గోడలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు.జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జిల్లా క్రీడా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఎక్కువ మొత్తంలో సహాయ సహకారాలు అందించానని క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న మెరికల్లాంటి క్రీడాకారులకు ప్రోత్సాహాలు అందజేస్తూ ఉత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు చట్టసభల్లో పోరాడుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అంతర్పుల శ్రీనివాస్ ప్రధానకార్యదర్శి:ఎండి యూనిస్ పాష స్కూల్ గేమ్స్ కార్యదర్శి: వేణుగోపాల్తెలంగాణ స్టేట్ పీఈటిఏ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము రోజు కృష్ణ బాబు శ్రీనివాస్ ఆర్. నరసయ్య ఉన్నారు..

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు యస్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో ప్రశంసా పత్రాలు

**కరీంనగర్ బ్యూరో, ప్రజాజ్యోతి**



ప్రపంచ క్రీడల్లో క్రికెట్కు ప్రత్యేక స్థానం ఉన్నదని చాలా మంది క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు యన్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చాటి ప్రశంస పత్రాలు సాధించిన సందర్భంగా ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యస్.జి.ఎఫ్ వారు పలు టోర్నమెంట్ల నిర్వహణ చూడడమే కాకుండా వారిని సరైన పద్ధతిలో అమలుపర్చేలా పలు నియమనిభంధనలు తెలుపుతోందని చెప్పారు. మన మన రాష్ట్రంలో యస్.జి.ఎఫ్ వారు ఆదేశించిన ప్రకారం నిర్దేశించిన సమయంలో ఆడాలని, ఆటగాళ్ల ప్రదర్శన మెరుగుపర్చుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వారిని వివిధ స్థాయిలో నిర్వహించబడే పలు క్రీడా పోటీలకు ఎంపిక చేయడమే కాకుండా కావల్సిన సమయంతో పాటు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని చెప్పారు.ఇటీవల కాలంలో జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో యన్.జి.ఎఫ్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన యన్.సుమేద్, 9వ తరగతి మరియు యన్.ప్రధ్యుమ్న, 8వ తరగతి రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ప్రశంసా పత్రాలను సాధించారని హర్షం వ్యక్తం చేస్తు వారిరువురికి పుష్పగుచ్చాలందజేసి రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో హోరెత్తిన బిఆర్ఎస్ శ్రేణుల నిరసన

### రైతు భరోసా ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

**హుజురాబాద్, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**



హుజురాబాద్ నియోజకవర్గ కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలతో హుజురాబాద్ మండల కేంద్రం హోరెత్తింది. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై హుజురాబాద్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రైతులు నిరసన కార్యక్రమాలకు పూనుకున్నారు. అధికారం కోసం రైతు భరోసా ఎకరానికి రూ. 15,000 ఇస్తామని మాయ మాటలు చెప్పి.. తీరా గద్దెనెక్కాక రైతు భరోసాను పక్కనబెట్టి రోజుకో మాట మాట్లడుతూ రైతులను సీఎం రేవంత్ సర్కార్ మోసం చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజురాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డిలు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతు భరోసా ఇవ్వలేమని సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యల పై, కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం పోయింది అన్నారు. అంతేగాక రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ, పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, కమలాపూర్, హుజురాబాద్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంఘం ఐలయ్య, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### జమ్మికుంట పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక – శివకుమార్ గౌడ్



**జమ్మికుంట, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**

నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్లతోనే సాధ్యమవుతుందని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని జమ్మికుంట పట్టణ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక – శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా పూదరి రేణుక – శివకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారి సొంతింటి కలని నిజం చేసిన ఘనత కాంగ్రెస్ దేనని గుర్తు చేశారు.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్ రూమ్ లు నియోజకవర్గంలో ఎవరికి ఇవ్వకుండా ఊరించిందే తప్ప నిరుపేదలకు అండగా నిలువలేదని మండిపడ్డారు.. మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అసలైన నిరుపేదలను గుర్తుంచుటకు హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల ను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని తెలిపారు.

## ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

### రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు మాజీ ఎంపీపీ బాలాజీ రావు



**సుల్తానాబాద్, అక్టోబర్ 20, ప్రజా జ్యోతి**

వానాకాలం పంట సీజన్లో 15 వేల రూపాయలు రైతు భరోసా కింద ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వకుండా రైతులను మోసం చేశారంటూ మాజీ ఎంపీపీ బాలాజీ రావు అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఆదివారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పైన ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బాలాజీ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు వానకాల సీజన్ అయిన రైతు భరోసా ఇప్పటివరకు రైతుల అకౌంట్లో పడలేదని రైతులకు రెండు లక్షల రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో మాఫీ కాలేదని ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని రైతు భరోసా కూడా వెంటనే విడుదల చేయాలని లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్ గౌడ్ తిప్పారపు కమలా దయాకర్ గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు బాబురావు మొలుగూరి అంజయ్య కనకం శంకర్ శ్రీనివాస్ సాజిత్ తో పాటు బిఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు

# రోడ్ల నిర్మాణాలకు సర్వం సిద్ధం

### పలు గ్రామాల్లో సమస్యలు పరిష్కారం.. MLC జీవన్ రెడ్డి కి కృతజ్ఞతలు..



**జగిత్యాల, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**

రాయికల్ మండలం శ్రీరాం నగర్ మరియు చెర్ల కొండాపూర్ ప్రజలు వారి గ్రామలకు నిధులు మంజూరు చేయించిన జీవన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలి పారుగత పాలనలో కనీసం గ్రామాలలో రోడ్లు కానీ ఇతర ఏ సమస్యలను పట్టించుకోలేదు ఈ ప్రభుత్వం లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గారు చొరవ తీసుకొని గ్రామల సమస్యలు రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించా రురాయికల్ మండలంలోని అల్లీపూర్ నుండి శ్రీరాం నగర్ ఎల్లమ్మ టెంపుల్ వరకు "కోటి యాబై లక్షల" రూపాయల నిధులు మరియు రాయికల్ మండలం చెర్లకొండపూర్ నుండి మైతపూర్ వరకు "కోటి ఎనభై ఆరు లక్షల" రూపాయల నిధులు రోడ్లకు మంజూరు చేయించినందుకు వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గారిని శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు..ఈకార్యక్రమంలో రాయికల్ మండలం – శ్రీరాం నగర్ మరియు చెర్ల కొండపూర్ గ్రామ ప్రజలు , నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సుదర్శన్ రెడ్డి పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### – కోరుట్ల మైనారిటీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్ధికి

**కోరుట్ల, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**



ఇల్లెందుల మండలంలో జర్నలిస్ట్ సుదర్శన్ రెడ్డి పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ సిద్ధికి డిమాండ్ చేశారు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిస్వార్థంగా ప్రజలకు నిజాలకు నిర్భయంగా చూపిస్తూ సేవ చేస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారుసుదర్శన్ రెడ్డి జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

# కోరుట్ల హాజీపూర బస్తి దవాఖాన లో స్త్రీలకు ఉచిత వైద్య శిబిరం



**కోరుట్ల, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**



కోరుట్ల పట్టణంలోని హాజీపూర బస్తీ దవాఖాన లో ఆదివారం రోజున "వసుధ హాస్పిటల్" కోరుట్ల వారి ఆధ్వర్యంలో స్త్రీల వైద్య నిపుణురాలు "డాక్టర్ తాటిపాముల సింధు" గారిచే 132 మంది స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇట్టి ఉచిత కార్యక్రమానికి వచ్చిన వార్డు ప్రజలు, ప్రజాప్రతినిధులు వసుధ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.

# హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి..

### రుణమాఫీ ఓ మోసం,రైతు భరోసా ఒక బోగస్...

### చిగురుమామిడిలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకుల ధర్నా...

### రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్న నాయకులు..



**చిగురుమామిడి, అక్టోబర్ 20 ప్రజాజ్యోతి**

అబద్దాల పునాదుల మీద ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని,తక్షణమే రైతుల ఖాతాల్లో రైతు భరోసా,రుణమాఫీ 2లక్షలు వేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వారి మంత్రుల బృందం పూటకో మాట మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు.ఇచ్చిన హామీలను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.రుణమాఫీ ఓ మోసమని,రైతు భరోసా ఒక భోగస్ అని కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రైతుబంధు బంద్ చేస్తారన్న మాజీ సీఎం కేసీఆర్ మాటలు నేడు నిజమయ్యాయని వారు పేర్కొన్నారు. రైతు బంధు రాక, రుణమాఫీ కాక రైతన్నలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులను పోలీసులు లాకెళ్ళారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ మంకు శ్రీనివాస్ రెడ్డి,సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ పోతరవేణి శ్రీనివాస్ యాదవ్,పెనుకుల తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి,బీసీ సెల్ మండల అధ్యక్షుడు అనుమాండ్ల సత్యనారాయణ,రామోజు కృష్ణమాచారి,సాంబారి కొమురయ్య, ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,నాగేల్లి రాజిరెడ్డి,మాజీ ఎంపిటిసి మెడబోయిన తిరుపతి,పెసరి రాజేశం,జక్కుల రవీందర్, కానుగంటి భూంరెడ్డి,దుడ్డేల లక్ష్మీనారాయణ,మక్బూల్ పాషా, బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు బోయిని మనోజ్ కుమార్, చెప్పాలా నారాయణరెడ్డి, చెప్పాలా శ్రీనివాస్,సందీప్ రెడ్డి,నరేందర్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు ఆకవరం శివప్రసాద్, బోయిని రమేష్,బుర్ర తిరుపతి గౌడ్, గిట్ల తిరుపతిరెడ్డి,బిల్లా వెంకట్ రెడ్డి,యాళ్లజనార్ధన్ రెడ్డి, ఎస్.కె సిరాజ్, తోడేటి శ్రీనివాస్, పిల్లి వేణు,శ్యామకూర సంపత్ రెడ్డి, కొమ్మెర భూపతి రెడ్డి,దుస్స గౌరీ శంకర్,కయ్యం సారంగం,తదితరులు పాల్గొన్నారు.

# ఖని లో ముఖ్య మంత్రి దిష్టి బొమ్మ దహనం



**గోదావరిఖని, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యల పై బి ఆర్ ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది.నిరసనగా ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ,మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్గాం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలు అమలు చేయకుండా ప్రజలను,రైతులను సిఎం మోసం చేస్తున్నారని మండి పడ్డారు .కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే రైతు బంధు పథకం అమలు చేయకుండా రైతులను రేవంత్ సర్కార్ నట్టేటా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం చందర్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ ఇతర నాయకులను పోలీసులు ఆరెస్ట్ చేశారు.మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలన యావత్తు తెలంగాణ రైతాంగం రాజులుగా బతికరన్నారు.కాంగ్రెస్ పాలనలో రైతులకు మాత్రం కన్నీళ్లు మిగిలాయని వాపోయారు.కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నసమయంలో రైతులకు సకాలంలో రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమా చేశారని గుర్తు చేశారు.అబద్దపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను,ప్రజలను,అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురి చేస్తుందని ఆక్షేపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామిలు నేరవేర్చే వరకు పోరాడుతామని,రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ ఆములనారాయణ,మాజీ వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ లు బండారి ప్రవీణ్,మేరుగు పోచం,దర్శి రాజేష్,సందేళ్ల మల్లయ్య,అర్షనపెల్లి శ్రీనివాస్,గంగాధరి రామన్న,కొలిపాక మధుకర్ రెడ్డి,కార్పొరేటర్ కలవచర్ల కృష్ణవేణి,నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్,నారాయణదాస్ మారుతీ,తోకల రమేష్,అర్షనపేల్లి రాజు,పోరండ్ల రాజి రెడ్డి,సట్టు శ్రీనివాస్,ముద్దసాని సంధ్యారెడ్డి,కొల్లూరి సమరం,ఎండీ అత్తారుద్దీన్,కాంపెల్లి సంతోష్,అవునూరి రాజేష్,కొంకటి సారయ్య,సారయ్య నాయక్,అర్షనపెల్లి శ్రీకాంత్,అవునూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం నడిపిన మైనర్ బాలునికి త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


### విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ పైకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

### గతంలో మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

**జమ్మికుంట, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి**

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రుల పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించిన తల్లిదండ్రుల తీరు మారడం లేదు.. మైనర్లు ద్విచక్ర వాహనాలు దొరకగానే త్రిబుల్ రైడింగ్, డబుల్ రైడింగ్ తో దూసుకెళ్తూ ఎదురుగా వచ్చే వారికి ప్రమాదం జరుగుతుంది అనేటువంటి జ్ఞానం కూడా లేకుండా ఇష్టం వచ్చినట్టుగా వాహనాలు నడుపుతూ చివరికి ప్రమాదాల బారిన పడుతున్నారు.. అలాంటి సంఘటనే జమ్మికుంట పట్టణంలోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఇరాన్ కాంపౌండ్ లోకి మైనర్ నడుపుతున్న ద్విచక్ర వాహనం దూసుకెళ్లింది.. .... స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణానికి చెందిన ఒక మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై స్పీడ్ గా వస్తు అదుపుతప్పి రోడ్డు పక్కన గల ట్రాన్స్ఫార్మర్ కాంపౌండ్ లోపలికి దూసుకు వెళ్లడంతో ద్విచక్ర వాహనం దెబ్బ తినగా దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరు మైనర్ బాలురు తృటిలో ప్రమాదం తప్పించుకున్నారు. ఘటన జరిగిన తీరును చూస్తే ఆ ఇద్దరు పిల్లలు ఎలా బతికారో ఊహిస్తే నే భయంకరంగా ఉంది. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని పోలీసులు పదేపదే చెబుతున్న తల్లిదండ్రులు బంధువులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. తెలిసి తెలియని వయసులో అవగాహన లేకుండా బండి ఉంది కదా అని అధిక స్పీడ్ తో ప్రయాణం చేస్తూ వాహనాలను కంట్రోల్ చేయలేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.ఈ సంఘటన లో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అదే గ్రహచారం బాగాలేక ఆ ద్విచక్ర వాహనం ట్రాన్స్ఫార్మర్ కు తగిలితే పరిస్థితి ఏంటి అనేది ఊహించు కుంటేనే భయంకరంగా ఉంది. ఇప్పటికైనా తల్లిదండ్రులారా మీ పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇచ్చి ప్రోత్సహించకండి. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కన్నా ప్రమాదాన్ని వివరిస్తే అందరికీ మంచిది. జమ్మికుంట పట్టణంలో మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనంపై త్రిపుల్ రైడ్ చేస్తూ తిరుగుతున్నారని పోలీసులకు సమాచారం ఇస్తే గతంలో చాలామందికి కౌన్సిలింగ్ నిర్వహించి హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు రావడం లేదు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరిగితే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు. ప్రాణాల పోతే బాధ్యత ఎవరిది ఇప్పటికైనా తల్లిదండ్రులారా ఆలోచించి మీ పిల్లలకు వాహనాలను అందించకుండా ప్రమాదాలను నివారించాలని, అయిన ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వారిని చూసి చూడనట్టు వదిలేయకుండా తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి మైనర్లకు వాహనాలు ఇచ్చిన వాహన యజమానిపై,తల్లిదండ్రుల పై కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.





# టేకుర్తి పాఠశాల పూర్వ విద్యార్థుల 'అపూర్వ' కలయిక

**2007 –08 పదవ తరగతి బ్యాచ్ 16 సంవత్సరాలకు ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు**

*జమ్మికుంట, అక్టోబర్ 20 ప్రజాజ్యోతి*



తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువుల చిరునామా లు సేకరించి ఒకే వేదిక పై వారిని ఏకం చేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు....టేకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007 – 08 సంవత్సరం లో పదవ తరగతి చదివిన విద్యార్థులు 16సంవత్సరాల క్రితం తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను కు స్వాగతం పలికారు..అనంతరం పూర్వ విద్యార్థుల ఉపాధ్యాయులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల కబుర్లు, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ, సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు..పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు శాలువాలతో, మెమొంటోస్ తో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు మాట్లాడుతూ 16సంవత్సరాల క్రితం పాఠశాల లో బోధించిన తమని గుర్తు పెట్టుకుని ఆప్యాయంగా ఆహ్వానించడం గొప్ప విషయమని అన్నారు... తమ వద్ద క్రమశిక్షణ తో కూడిన విద్యను అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు ఇతర బిజినెస్ రంగాలలో స్థిరపడి ఇతరుల కు సహాయం చేసే గొప్ప స్థాయిలో నిలబడినందుకు ఆనందంగా ఉందని వారిని అభినందిస్తూ ఆశీర్వదించారు..ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సుభాష్, రామ్ రెడ్డి, సంపత్, భాస్కర్, శ్రీనివాస్, రామచంద్రం, కిషన్, ఎల్లస్వామి, తిరుపతి, కృష్ణవేణి, పూర్వ విద్యార్థులు సాంబయ్య, విజేందర్, మహేష్, శ్యామ్, శిరీష, లావణ్య, స్వప్న, జ్యోతి, వనజ, హాజర, కరుణ లతో పాటు సుమారు 50మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి వినియోగం పై ఉపేక్షించేది లేదు

**ఇకనుంచి కౌన్సెలింగ్ లేదు**

**నేరుగా కేసులు పెడతాం**

**అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి**

**వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి**

*గోదావరిఖని, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*




గంజాయి వినియోగంపై ఉపేక్షించేది లేదని గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన డ్రగ్ నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు.గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఆదివారం పోలీస్ స్టేషన్లో వివరాలను సీఐ వెల్లడించారు.శనివారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఇద్దరు యువకులు బైక్ పై వచ్చి మిలీనియం క్వార్టర్స్ ఏరియాలో చెట్ల మధ్యలో రాత్రి 9 గంటల సమయంలో సిగరెట్ తాగుతూ అందులో గంజాయి పెట్టి తాగుతున్నారాగుతున్నారని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.వారి దగ్గర నుండి 80 గ్రాముల గంజాయిని, బైక్,రెండు సెల్ ఫోన్లను సీజ్ చేశామని ,వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అందులో ఒక వ్యక్తి హైదరాబాద్ బాలానగర్ లోని ఒక వ్యక్తి దగ్గర 250గ్రాముల గంజాయిని తీసుకొచ్చాడని,ఇద్దరు వ్యక్తులు కలిసి రోజు విడిచిరోజు తాగుతున్నట్లు ఒప్పు కున్నారని,వీరి పై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నట్లు చెప్పారు.వీరు ఎవరికి విక్రయించారని, ఎక్కడి నుంచి తీసుకొచ్చారని విషయం పై విచారణ కొనసాగుతుందని, వీరికి తప్పనిసరిగా శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

**గంజాయి పై ఉక్కుపాదం....**

గోదావరిఖనిలో గంజాయి,డ్రగ్స్ అనేవి లేకుండా చేయాలని కృత నిశ్చయంతో పోలీసులు పనిచేస్తున్నట్లు సిఐ తెలిపారు. దీనిలో భాగంగానే ఇప్పటివరకు 3గంజాయి కేసులు పెట్టి 24 మంది గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు.వారి దగ్గర నుండి 16 కిలోల గంజాయిని పట్టుకున్నామని, గంజాయి తాగుతున్న 43 మంది యువకులను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు.ఇక నుంచి ఎవరైనా గంజాయి తీసుకొచ్చినా, అమ్మినా, కొని తాగినా... వారి పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గతంలో మాదిరిగా కౌన్సిలింగ్ ఇవ్వబోమని, నేరుగా కేసులు నమోదు చేసి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.తల్లిదండ్రులు,పెద్దలు, పిల్లల ప్రవర్తన, వారి నడవడిక పై శ్రద్ధ వహించాలని సూచించారు.వారు చేస్తున్న కార్యక్రమాలు అనుమానంగా ఉంటే తప్పనిసరిగా మందలించాలని అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్, గంజాయి రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి పోలీసులకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

*కొడిమ్యాల, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించాడు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే సమాచారం అందిస్తే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి,ప్యాక్స్ చైర్మన్లు రాజనర్సింగరావు,బండ రవీందర్ రెడ్డి, రాజేందర్, ఎమ్మార్వో రమేష్,మండల వ్యవసాయాధికారి పి.జ్యోతి,ఏపియం రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బర్ల లింగయ్య,నాయకులు మహిపాల్ రెడ్డి,మల్లికార్జున్ రెడ్డి,చిలివేరి నారాయణ,అధికారులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# బకాయి డీ.ఏ. లను వెంటనే విడుదల చేయాలి

**టిజిబిటిఎఫ్ రాష్ట్ర నాయకులు రాం. రాజయ్య**

*జమ్మికుంట, అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*




తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావల్సిన నాలుగు బకాయి డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టి.జి.బి.టి.ఎఫ్.రాష్ట్ర అధ్యక్షుడు రాం. రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ విడుదల చేయాలని కోరారు. సకాలంలో విడుదల చేయకపోవడంతో నిరుపేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తద్వారా ఆ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజుల కోసం వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల కలలను నిర్వీర్యం చేశారన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించిన డీఏలను సకాలంలో అందజేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర కలత (ఆందోళన) చెందారన్నారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు.వారి కలలను సాకారం చేయాల్సిన ఆవశ్యకత ప్రభుత్వం పై ఉందన్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిట్టల తిరుపతిని పరామర్శించిన టీయూడబ్ల్యూజే సభ్యులు..



*చిగురుమామిడి , అక్టోబర్ 20, ప్రజాజ్యోతి*

హుస్నాబాద్ నియోజకవర్గ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్,హుస్నాబాద్ డివిజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పిట్టల తిరుపతి సోదరుడు పిట్టల రాములు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను చిగురుమామిడి టీయూడబ్ల్యూజే(ఐజేయు) ప్రెస్ క్లబ్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. పిట్టల రాములు మృతికి గల కారణాలను తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. అందరితో కలివిడిగా ఉండే రాములు ఆకస్మిక మృతి తమను బాధించిందని ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు.పరామర్శించిన వారిలో ప్రెస్ క్లబ్ అడ్హాక్ కమిటీ కన్వీనర్ పత్తెం రమేష్(పీఆర్పీ న్యూస్ ఛానెల్ సీఈవో),సూర్య రిపోర్టర్ జేరిపోతుల సదానందం,రిపోర్టర్ ఎనగందుల అశోక్,మన తెలంగాణ రిపోర్టర్ పత్తెం శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

# జాతీయ సాహస శిబిరానికి అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక


*ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో:*




ఈ నెల 22.10.2024 నుండి 31.10.2024 వరకు హిమచల్ ప్రదేశ్ లోని అటల్బిహారివాజ్పేయి ఇన్సిట్యూట్ ఆఫ్ మౌంటేన్ రింగ్ అండ్ అలెడ్ స్పోర్ట్స్, నార్కండ సెంటర్లో జరిగే జాతీయ సాహస శిబిరానికి అల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పి.జి కళాశాల బి.కాం ద్వితీయ సంవత్సరం ఎన్. యస్. యస్ వాలంటీర్ కె. హర్షిత ఎంపిక యార్యరు.కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కరెస్పాండెంట్ వి.రవీందర్రెడ్డి పుష్పగుచ్చం ఇచ్చి కె.హర్షితను అభినందించారు. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్.యస్.యస్. వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని, మంచి క్రమశిక్షణ అలవడుతుందని, నాయకత్వలక్షణాలు అభివృద్ధి చెందుతాయని,ఎన్.యస్.యస్ ద్వారా మంచి సేవాదృక్పతం అలవడుతుందని తెలిపారు.రాబోయే కాలంలో మిగితా విద్యార్థులు కూడా కె. హర్షితను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, ఎన్.యస్.యస్. ప్రొగ్రామ్ అధికారులు బి. అనిల్, యన్. రజిత, అధ్యపకులు వాలంటీర్లు పాల్గొన్నారు.

# లక్ష మంది సభ్యులను చేర్చడమే మా లక్ష్యం

**బిజెపి సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ క్యాతం**



*గోదావరిఖని , అక్టోబర్ 20, ప్రజాజ్యోతి* పెద్దపల్లి జిల్లాలో లక్ష మందిని బిజెపిలో సభ్యులుగా చేర్చడమే తమ లక్ష్యమని ఆ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు.ఆదివారం రామగుండం కార్పొరేషన్ 25,26వ డివిజన్లలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం కోసం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో లక్ష సభ్యత్వం నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటివరకు 33 వేల సభ్యత్వాలు పూర్తయినట్లు వెల్లడించారు.యువకులతో పాటు వృద్ధులు సైతం బిజెపిలో చేరుతున్నారని, రానున్న రోజులలో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోడూరు రమేష్, గజ్జల భాస్కర్, దండు పవన్, పులి విష్ణువర్ధన్ రెడ్డి , శేఖర్, మల్లయ్య పాల్గొన్నారు.